క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన గర్లంకి ఉమామహేశ్వరరావు, ఈశ్వరమ్మ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ ఈవో వై.భద్రాజీకి విరాళ నగదును అందజేసి శాశ్వత అన్నదాన పథకంలో వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని రణస్థలం గ్రామానికి చెందిన కేలం వెంకటరమణ భార్య గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. అలాగే వెంకటరమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. దీంతో వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వామివారికి వెండి హారం బహూకరణ



స్వామివారికి హారం అలంకరించిన దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివ బాలాజీ ఆలయంలో వేంజేసిన వేంకటేశ్వర స్వామి వారికి వ్యూహ లక్ష్మీ రజిత హారాన్ని అదే కాలనీకి చెందిన శ్రావ్య తన మొదటి జీతంతో చేయించి సమర్పించింది. ఈ హారాన్ని అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, సత్యకూర్మాచార్యులు స్వామివారికి అలంకరించారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి సింగుపురం గ్రామంలో కొలువైన పార్వతీ కొండమ్మ సమేత హాటకేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 4వ తేదీ నుంచి ప్రారంభమవ్వనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త గుండ ఆదిత్యనాయుడు తెలిపారు. దేవాలయ సన్నిధానంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 8న కొండమ్మ పిలుపు, 9న కల్యాణ మహోత్సవం, 10న సదస్య ఉత్సవం, 11న దీపోత్సవం, 12న చైత్రశుద్ధ పౌర్ణమి, వసంతోత్సవం, 13న శక్తి ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పంచాంగ శ్రవణ రాశుల ఫలితాలను వనమాలి సీతారామ శర్మ వినిపించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పెంట రామకృష్ణశర్మ, కార్యనిర్వహణ అధికారి పి.మాధవి, గణపతిరావు, చీపురు రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



తులసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో శ్రీరామ మందిరం వద్ద ఉన్న తులసమ్మ విగ్రహానికి వార్షికోత్సవ పూజలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రామాలయంలో పంచాంగ శ్రవణం చేపట్టారు.

ఆకతాయిల ఆగడాలు

- అబ్దుల్ కలాం పార్కులో అసాంఘిక చర్యలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- చర్యలు తీసుకోవాలని విన్నపాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

నగరంలోని ఉమెన్స్ కాలేజీకి దగ్గరలో డీపీఆర్‌వో కార్యాలయానికి ఆనుకొని ఉన్న అబ్దుల్ కలాం పార్కులో ఆకతాయిల ఆగడాలు పెరుగుతున్నాయి. సమీపంలోని వృద్ధులు, చిన్నారులు ఉదయం, సాయంత్రం వేళల్లో సేద తీరేందుకు వీలుగా కార్పొరేషన్ అధికారులు ఈ పార్కును ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం కొంతమంది వ్యక్తులు ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో పార్కుకు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పార్కుకు సరైన రక్షణ గోడలు చుట్టూ లేకపోవడమే దీనంతటికీ కారణమని చెబుతున్నారు. ఈ పార్కు టైమింగ్స్ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు మాత్రమే ఉన్నా అవేమీ వర్తించడం లేదు. వాచ్‌మెన్ ఉన్నా ఆకతాయిలు ఆయనను సైతం భయపెడుతుండడంతో ఎవరినీ ఏమీ అనలేని దుస్థితి నెలకొంది. అందువలన ఇప్పటికైనా ఇటువంటి పార్కులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అబ్దుల్ కలాం పార్కు

ప్రత్యేక దృష్టి సారించాలి



జనావాసాల మధ్యలో ఉన్న పార్కులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలి. పార్కులకి ప్రతి ఒక్కరూ సేద తీరేందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. కొంతమంది ఆకతాయిలు ఈ పార్కుని తమ సొంత స్థలంలా వాడుకుంటున్నారు. కళాశాలల యాజమాన్యాలు సైతం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తే మంచిది.

– ఎన్ని ధనుంజయరావు, బాకర్‌సాహెబ్‌పేట, శ్రీకాకుళం

చర్యలు చేపడతాం



పార్కులు తెరిచి ఉన్న సమయంలో కేర్ టేకర్స్‌ని ఉంచుతున్నాం. ఆ సమయాల్లో కాకుండా ఎవరైనా ఆకతాయిలు పార్కుల్లో కనిపిస్తే వారిని పోలీసులకు అప్పగిస్తాం. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం. రక్షణ గోడలు అవసరమైన చోట పెంచుతాం. పార్కులు విశ్రాంతి తీసుకోవడానికే తప్ప అసాంఘిక కార్యకలాపాలకు కాదు. పార్కులను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

– పి.వి.వి.డి ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం



పార్కు నిర్ణీత సమయంలో కాకుండా ఉన్న ఆకతాయిలు

అంతర పంటగా పశుగ్రాసం



ప్రస్తుతం కొబ్బరి తోటల్లో అంతర పంటగా పశుగ్రాసం సాగు చేస్తున్నారు. ఎచ్చెర్ల, సంతసీతారాంపురం, బడివానిపేట ప్రాంతాల్లోని కొబ్బరి తోటల్లో పశుగ్రాసం విస్తారంగా సాగు చేస్తున్నారు. గిన్నీ, స్టైలో వంటి రకాల సాగు చేపడుతున్నారు. దీనివలన తోటల్లో పిచ్చిమొక్కలు పెరగడానికి అవకాశం ఉండదు. అలాగే మరోపక్క పశు పోషణకి గడ్డి ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

అధ్వానం



శ్రీకాకుళం నగరంలోని విశాఖ–ఏ కాలనీలో కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి అధ్వానంగా మారింది. దీంతో దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుకనే ఇటువంటి దుస్థితి ఉంటే నగరమంతా ఇంకెలా ఉంటుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే చొరవచూపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

జి.సిగడాం: నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండంలోని వాండ్రంగి పంచాయతీలో నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని వెల్లడించారు. కాగా గ్రామానికి మడ్డువలస కాలువ ద్వారా సాగునీరు అందించాలని విశ్రాంత ఉపాధ్యాయుడు పొగిరి జగన్నాథంనాయుడు, మండల నాయకుడు బూరాడ వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, భూపతి అర్జున కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పేదలకు రంజాన్ తోఫా

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో జామియా మసీదు సభ్యులు రంజాన్ పురస్కరించుకొని పేద ముస్లింలకు రంజాన్ తోఫాను ఆదివారం పంపిణీ చేశారు. బియ్యం, పంచదార, సేమియా, పాలు, చీరలు, లుంగీలు, టవల్స్‌తో కూడిన కిట్లను 150 మంది పేద ముస్లింలకు అందజేశారు. కార్యక్రమంలో సూర శ్రీనివాసరావు, జాఫర్ బాయి, అబ్దుల్ సునీల్ భాషా, జిలానీఖాన్, అక్బర్ భాషా, ఇన్‌స్పెక్టర్ సాదిక్, జామియా మసీదు ఇమామ్ అబ్దుల్ వహేబ్, అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్, గౌరవ అధ్యక్షుడు అమీరుల్లా బేగ్, సలీమ్‌ఖాన్, హాజీభయ్యా, అక్బర్ భాషా, షకూర్‌ఖాన్, ఉస్మాన్, అబ్దుల్, సయ్యద్ షఫీ, ముబారక్, షాన్, తాజ్‌మదీనా, బహదూర్ జానీ, సలీం, అబ్దుల్ రషీద్, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉగాది పురస్కారాలు అందజేత

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి ఆదిత్యానగర్ కాలనీలోని మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ(ఎంసీఏ) ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాది పురస్కారాలు ఆదివారం అందజేశారు. ఎంసీఏ వ్యవస్థాపకులు మణిపాత్రుని భాగ్యలక్ష్మి, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో బాలరంజని సంస్థ తరపున వివిధ నైపుణ్యాల్లో ప్రతిభ సాధించిన బాలలకు సైతం గొండు శంకర్ చేతులమీదుగా అవార్డులు అందించారు. సాహిత్య రత్న పురస్కారంతో గ్రామనామాల పరిశోధన గ్రంథకర్త వాండ్రంగి కొండలరావును, సేవారత్న పురస్కారంతో బద్రి కూర్మారావును, నాట్యరత్నతో కంటు మురళీ గోవింద్‌ను, నటరత్నతో ఎర్రపాటి అప్పారావును, గానరత్నతో నేరేళ్ల సత్యనారాయణను, వాయిద్య రత్నతో ఆచింటు లక్ష్మణరావును, హరికథా రత్నతో వడగ సుబ్రహ్మణ్యంను, వైద్యరత్నతో ఇంజరాపు మోహన్‌రావును, యువసేవా రత్నతో యాపార శ్రీనివాసును సత్కరించారు. అలాగే ఎలినాటి ధరణి (బాలరత్న–కోలాటం), బి.సన్నిహిత్ (బాలరత్న–చిత్రలేఖనం), ఎం.లిప్సి, శ్రీవల్లి, జయదేవ్‌కుమార్ (కూచిపూడి, సంగీతం), శ్రీకాకుళం చిట్టి (బాలరత్న–ఇన్‌స్టాగామ్), బిన్నాడ దీక్షిత్ (శ్లోకపఠనం)లను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో బలివాడ మల్లేశ్వరరావు, వెంకటరావ్ మాస్టర్, యోగానంద్, బాలరంజని రాష్ట్ర కార్యదర్శి గోవిందరావు, ఎం.టి.వి.ఆర్ మూర్తి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



కొండలరావును సత్కరిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదంలో గడ్డికుప్ప దగ్ధం



కాలిపోతున్న గడ్డికుప్ప

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని కేశవరాయునిపాలేం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డికుప్ప దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని వడ్డి బోడమ్మకు చెందిన గడ్డికుప్పలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో కుప్పమొత్తం బూడిదైందన్నారు. రణస్థలం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

డ్రాయింగ్ క్లాసులు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాత శ్రీకాకుళంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయం వద్ద డ్రాయింగ్ క్లాసులు ఆదివారం ప్రారంభించారు. ప్రతీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి, గురువారం సాయంత్రం 5 గంటల నుంచి క్లాసులు జరుగుతాయని నిర్వాహకురాలు లోకనాథం దీప్తి తెలిపారు. కార్యక్రమంలో మిమిక్రీ కళాకారుడు నందికేశ్వరరావు, లయన్ మెంటార్ నటుకుల మోహన్, బీఎంఎస్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

కొంగొత్త ఆశలతో..!

పల్లె పరవశించింది. విశ్వావసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికింది. ఉగాది పండుగను ఆదివారం సంప్రదాయబద్ధంగా ప్రజలు జరుపుకున్నారు. వేకువజాము నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రైతులు ఏరువాక ప్రారంభించి ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు కలిసి రావాలని మొక్కుకున్నారు. ఆలయాలు, రచ్చబండల వద్ద పండితులు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. సాంప్రదాయ వస్త్రధారణలో ప్రతి ఒక్కరూ మెరిశారు.

– సాక్షి నెట్‌వర్క్



గార: కూర్మనాథాలయంలో పంచాంగ శ్రవణం



శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో పార్వతీదేవికి అభిషేకాలు



రణస్థలం: చినలంకపేటలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు



జి.సిగడాం: చెట్టుపొదిలాంలో...



శ్రీకాకుళం కల్చరల్: ఉపనిషన్మందిరంలో విక్రమశర్మకు సత్కారం



జి.సిగడాం తొలిఏరు పూసిన రైతులు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారికి పూజలు



అరసవల్లి: భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది



శ్రీకాకుళం కల్చరల్: విజయ గణపతి ఆలయంలో పూజలు



శ్రీకాకుళం కల్చరల్: కోదండరాముడికి పూజలు



అరసవల్లి: ఎస్పీ మహేశ్వరరెడ్డికి పంచాంగాన్ని, ప్రసాదాలను అందజేస్తున్న శంకరశర్మ



శ్రీకాకుళం కల్చరల్: బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో సత్కారాలు

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వేసవి నేపథ్యం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ గొండు గంగాధర్‌రావు సూచించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి జాగ్రత్తలపై ప్రత్యేక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వీయ రక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ విధిగా తాగునీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, ఉప్పు చేపలు, పచ్చళ్లకు దూరంగా ఉండాలన్నారు. సమతుల ఆహారాన్ని ఈ కాలంలో అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల జగ్గారావు, గురు ఆనందరావు, సుగంధం సంజీవరావు, గేదెల లక్ష్మి, గోలీ ఉమామహేశ్వరరావు, ఎస్.ఉపేంద్ర, జ్యోతి, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొండు గంగాధర్

సంక్షిప్తంగా...

స్వర్ణ కిరీటానికి విరాళాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో వేంచేసిన గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి స్వర్ణ కిరీటం చేయించే నిమిత్తం పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందించారు. మంగువారితోటకు చెందిన లంకలపల్లి చలపతి 10 గ్రాముల బంగారం, పిండివారి కుటుంబ సభ్యులు రూ.50 వేల నగదు, గుండు లక్ష్మీదేవి జ్ఞాపకార్థం కుమారులు శివ, పార్వతులు అమ్మవారికి రూ.10,001లు కమిటీ సభ్యులకు అందజేశారు.

జర్నలిజం మూవీ చిత్రీకరణ

శ్రీకాకుళం అర్బన్: స్థానిక తమ్మినాయుడుపేటలోని లలిత త్రిపుర సుందరీదేవి గుడిలో పీకే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో చిత్రీకరించనున్న జర్నలిజం మూవీ ముహూర్తపు షాట్‌ను ఆదివారం తీశారు. మణిపాత్రుని నాగేశ్వరరావు చేతులమీదుగా క్లాప్ కొట్టి షూటింగ్ మొదలు పెట్టారు. కార్యక్రమంలో పీకే ఎంటర్‌టైన్‌మెంట్ నిర్వాహకులు ప్రసాద్, మూవీ టీం రొక్కం భాస్కర్, బొడ్డేపల్లి లక్ష్మణ్, గోవింద్, రాజశేఖర్, సంజు, శ్రీనివాస్, బాలు, ఎస్.రాజశేఖర్, కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కేంద్ర గ్రంథాలయంలో యువ రచయితల వేదిక అధ్యక్షురాలు తంగి ఎర్రమ్మ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, సురంగి మోహనరావు, మహ్మద్ రఫీ(ఈ–వేమన), గుణస్వామి, ప్రొఫెసర్ ఆరికతోట కనకరాజు, బలివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పండితులకు సత్కారం

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో ఉగాది పురస్కరించుకొని ముగ్గురు పండితులను దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. పండితులు తిరుమల పెద్దింటి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చామర్ల నాగవెంకట కూర్మాచార్యులు, టీపీ శ్రీనివాసాచార్యులను ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్ల సీతారామనృసింహాచార్యులు ఘనంగా సత్కరించారు. ప్రశంసాపత్రాలతో పాటు ఒక్కొక్కరికీ రూ.10,016ల చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, నల్లకూర్మనాచార్యులు, నర్సుబాబు పాల్గొన్నారు.


శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభం



పెద్ద అంబటివానిపేటలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గార: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీకూర్మం దేవస్థాన వీధిలో సీతారామచంద్రులు, లక్ష్మణ, ఆంజనేయ పెరుమాళ్లను శాస్త్రోక్తకంగా మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగించారు. పెద్ద అంబటివానిపేటలో కల్యాణమూర్తులను మహిళా భజన బృందాలు, మహిళా కోలాటాలు, వేషధారణలు నడుమ ప్రత్యేకంగా ఊరేగించారు. అంపోలు, లింగాలవలస, జొన్నలపాడు కాలనీ తదితర గ్రామాల్లో నవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో నాణ్యమైన పంటలు



మట్టికి పూజలు చేపడుతున్న దృశ్యం

గార: సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం వలన నాణ్యమైన పంటలు పొందవచ్చని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు పేర్కొన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలో అంపోలు పంచాయతీ లింగాలవలస గ్రామంలోని గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో భూ సుపోషణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామ పురోహితుడు శబరి శర్మ రైతులు తెచ్చిన మట్టికి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.